విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, సోమవారం 05, జూన్ 2023

కార్మికుల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తాం

విశాలాంధ్ర బ్యూరో - అనంతపురం : మున్సిపల్ అవుట్సోర్సింగ్ కార్మికులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు, ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ నెల 11,12,13 తేదీలల్లో ఉత్తర ప్రదేశ్ రాజధాని లక్నోలో జరుగు అఖిల భారత మున్సిపల్ ఫెడరేషన్ 7వ జాతీయ మహాసభలకు పిలుపునిస్తూ ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎఐటియుసి కార్యాలయంలో కరపత్రాలను విడుదల చేశారు. రాజేష్ గౌడ్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యలు రోజు రోజుకూ పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. మున్సిపల్ వర్కర్స్ ఒక్కరోజు విధులకు హాజరు కాకపోయినా ఆయా ప్రాంతాలు భ్రష్టుపట్టి పోతాయని తెలిసినా పాలకులు ఏమాత్రం పట్టించుకోవడంలేదని అసహనం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సఫాయి కర్మాచారి బోర్డు సభ్యులు పర్యటనలకు మాత్రమే పరిమితమయ్యారని కార్మికుల సమస్యలు పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. బోర్డు ద్వారా రావాల్సిన రుణాలు సైతం కార్మికులకు అందడం లేదని ఏకరువు పెట్టారు. సుప్రీం కోర్టు చెప్పిన విధంగా ఏ రాష్ట్రంలోను సమాన పనికి సమాన వేతనం అమలు కావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఘాటుగా విమర్శించారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో కార్మికుల సమస్యలు ఎన్నో విధాలుగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ప్రజా ప్రతినిధులు వినేపరిస్థితిలో లేరని విరుచుకు పడ్డారు. అవుట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేస్తామని బహిరంగ హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన సీఎం జగన్ మాట తప్పి మడమతిప్పాడని తూర్పారబట్టారు. కార్మికులకు కనీస వేతనాల చట్టం అమలు కావడం లేదన్నారు. కార్మికులకు కల్పించాల్సిన సబ్బులు, గ్లౌజులు, బూట్లు, నూనే, యూనిఫారం తదితర పరికరాలు సైతం ఇచ్చే పరిస్థితిలో వైసీపీ ప్రభుత్వం లేదని దుయ్యబట్టారు. దేశవ్యాప్తంగా ఆయారాష్ట్రాల్లో మున్సిపల్ వర్కర్స్ సమస్యలు ఏ ఒక్కటీ పరిష్కారం కాలేదని వారి సమస్యలపై మూడు రోజులపాటు లక్నోలో జాతీయ మహాసభలు నిర్వహిస్తున్నారని తెలిపారు. దేశ వ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై అగ్రనాయకత్వం మహా సభల్లో చర్చించి భవిష్యత్ కార్యాచరణ నిర్ణయిస్తారని స్పష్టం చేశారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు శివకృష్ణ, తిరుమలయ్య, మాధవ, ఎర్రప్ప, ఏఐటియుసి నగర నాయకుడు హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభ అవార్డుల ప్రధానం

విశాలాంధ్ర - కళ్యాణదుర్గం : పదో తరగతి ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ఫర్ ద పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతిభ అవార్డులను ప్రదానం చేశారు ఆదివారం కళ్యాణదుర్గంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి కళ్యాణ మండపం నందు ఫర్ ద పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కాంచన గంగ, ఈమె భర్త డీ.ఎస్. మూర్తి అధ్వర్యంలో ప్రతిభ అవార్డుల ప్రధానోత్సవం చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరి, సీనియర్ నాయకులు మోరేపల్లి మల్లికర్జున, రాష్ట్ర లీగల్ సెల్ నాయకులు గాజుల అదెన్న, టీచర్ వెంకటేశులు, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మెన్ పాపంపల్లి రామాంజినేయులు, కళ్యాణదుర్గం మండల కన్వీనర్ గోళ్ల వేంకటేశులు, మాజీ లీడ్ క్యాప్ డైరెక్టర్ అవుల తిప్పేస్వామి, మాజీ సర్పంచ్ గాజుల శ్రీరాములు, మాజీ జెడ్పీటీసీ కొల్లపురప్ప, గరికపాటి సురేష్, మల్లివల్లి నారాయణ, మాజీ సర్పంచ్ గోవిందరెడ్డి, చల్లా కిషోర్, మాజీ మండల కన్వీనర్ గురుప్రసాద్, మాజీ ఎంపీటీసీ ఓబుగానిపల్లి రాము, మాజీ ఎంపీటీసీ లింగన్న, గాజుల మారుతి తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులకు చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు అవార్డులతో పాటు మొక్కలు పంపిణీ చేశారు.

ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెట్టిస్తారా..?

విశాలాంధ్ర - కళ్యాణదుర్గం : కుందుర్పి మండల కేంద్రంలో దివ్యాంగుల కోసం గత ప్రభుత్వం ఇచ్చిన కమ్యూనిటీ భవనం స్థలాన్ని వారికి అప్పగించకుండా రెవెన్యూ అధికారులు కాలయాపన చేయడాన్ని ప్రశ్నించిన పలువురి వికలాంగులపై మంత్రి ఆదేశాలతో అక్రమ కేసులు బనాయిస్తున్నారని టిడిపి నాయకులు మారుతి చౌదరి మండిపడ్డారు. గత వారం రోజులుగా కుందుర్పిలో నిరాహార దీక్షకు దిగిన వికలాంగులకు మద్దతుగా ఆయన నిలిచారు. కళ్యాణదుర్గంలో మంత్రి ఉషశ్రీ చరన్ ఆదివారం విజయోత్సవ సభను అడ్డుకుంటామంటూ వికలాంగులు చేసిన ప్రకటనను పోలీసులు సీరియస్గా తీసుకొని అర్ధరాత్రి అరెస్టు చేయడం సమంజసం కాదని వికలాంగుల న్యాయమైన కోర్కెల సాధన కోసం ప్రభుత్వం ముందుకు రావాలని కోరారు. ముందస్తు అరెస్టులు చేసిన వికలాంగులను కుందుర్పి పోలీస్టేషన్లో ఉంచడంతో వారిని పరామర్శించడానికి వెళ్లిన టిడిపి నాయకులు మారుతి చౌదరి మాట్లాడుతూ ప్రభుత్వ చేతకానితనాన్ని పోలీసుల ద్వారా నిరూపించుకుంటుందని నియోజకవర్గ అభివృద్ధికి ఎలాంటి దృష్టి సారించకుండా వికలాంగులను సైతం అరెస్టు చేయించడాన్ని మంత్రి ఉషశ్రీ సమర్పించుకుంటారా అని ప్రశ్నించారు. కేసులు బనాయిస్తూ పేద ప్రజల మనోధైర్యాన్ని దెబ్బతీయాలని చూస్తే మంత్రి ఉషశ్రీ కి భవిష్యత్తులో తగిన గుణపాఠం చెప్తామని టిడిపి నాయకులు హెచ్చరించారు. టిడిపి మండల కన్వీనర్ గోళ్ళ వెంకటేశులు, మాజి మండల కన్వీనర్ కె. రామాంజనేయులు, మాజీజెడ్పిటిసిమల్లికార్జున రామ్మూర్తినాయుడు పాల్గొన్నారు.

రైతు సంక్షేమం టీడీపీతోనే సాధ్యం

విశాలాంధ్ర-గుంతకల్లు : రాష్ట్రంలో చంద్రన్న పరిపాలనలో రైతన్నలకు పెద్దపీట వేసి ఏరువాక పౌర్ణమి పండుగ అంటేనే రైతన్నలకు గుర్తొచ్చేది టిడిపి నేనని రైతు సంక్షేమం టిడిపి తోనే సాధ్యమని టిడిపి మాజీ చైర్మన్ శ్రీనాథ్ గౌడ్ అన్నారు. స్థానిక మాజీ ఎమ్మెల్యే ఆర్ జితేంద్ర గౌడ్ క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనాథ్ గౌడ్ మాట్లాడుతూ...రాష్ట్రంలో చంద్రన్న పాలనలో వ్యవసాయాన్ని ఏరువాక పండుగ చేయడం జరిగిందన్నారు. అయితే ప్రస్తుత ప్రభుత్వంలో నాలుగేళ్ల పాలనలో అన్నదాతలు తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయారని అన్నారు. నేడు రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర లేవన్నారు. రైతు భరోసా, పంట నష్టపరిహారం, సున్నా వడ్డీ రుణాలు, ధాన్యం కొనుగోలు, రైతులకు యంత్ర పరికరాలు పంపిణీ చేయడంలో విఫలమయ్యారన్నారు. రైతు సంక్షేమానికి చంద్రన్న తోనే సాధ్యం అన్నారు. ఈ సమావేశంలో మాజి ఎంపీపి రాయల రామయ్య, టిడీపీ నాయకులు జి.వెంకటేష్, తలారి మస్తానప్ప, కౌన్సిలర్ కృపాకర్, మాజీ కౌన్సిలర్లు హనుమంతు, శివన్న, ఫజులు పాల్గొన్నారు.

విద్యార్థులను ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దాలి

విశాలాంధ్ర - రాప్తాడు : విద్యార్థులను భవిష్యత్తులో ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు అకాడమీ ప్రారంభించడం అభినందనీయమని ఏపీ సాఫ్ట్బాల్ సీఈఓ సి. వెంకటేసులు పేర్కొన్నారు. సీనియర్ సాఫ్టుబాల్ క్రీడాకారుడు, కోచ్ జగదీష్ అనంతపురం నగరంలోని వేణుగోపాల్ నగర్లో అనంత అకాడమీ పేరుతో కోచింగ్ క్యాంపును ఆదివారం ప్రారంభించారు. సి.వెంకటేసులు మాట్లాడుతూ క్రీడలను నేర్చుకోవడం వల్ల క్రీడ కోటాలో విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో రెండు శాతం రిజర్వేషన్ ఉంటుందని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముఖ్యఅతిథులు కృష్ణమూర్తి, కొండమీంద రాయుడు, దామోదర్, 11వ వార్డు కార్పొరేటర్ వెంకటసుబ్బయ్య, అనంత సాఫ్ట్బాల్ అకాడమీ సెక్రటరీ ఏవీ రమణ పాల్గొన్నారు.

ప్రజల జీవితాల్లో వెలుగు నింపడమే లక్ష్యం

విశాలాంధ్ర - కనేకల్లు : కనేకల్ మండలం పరిధిలో సోల్లాపురం గ్రామ సచివాలయం, సోలాపురం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంను చేపట్టి ప్రతి గడప గడపకు తిరిగి వారి సమస్యలు వింటూ వాటిని తక్షణమే పరిష్కరిస్తూన్న సీఎం జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు గురించి ప్రతి ఇంటికి వెళ్లి వివరిస్తూ పథకాల అమలుపై ప్రజలను అడిగి తెలుసుకుంటూ ముందుకు వెళుతున్న రాయదుర్గం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి. ఆయన మాట్లాడుతూ వైయస్ జగన్మోహన్ రెడ్డి మానస పుత్రిక అయిన గ్రామ సచివాలయం వ్యవస్థ ద్వారా అవినీతికి తావు లేకుండా లంచాలు లేకుండా అర్హత ప్రామాణికంగా ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు వైయస్ జగన్మోహన్ రెడ్డి అందజేస్తున్నారని తెలియజేశారు. గ్రామ వాలంటరీల ద్వారా తెల్లవారుజామున కోడి కూయకముందే ఇంటి దగ్గరికి వచ్చి పింఛన్లు పంపిణీ చేయడం జరుగుతుందని తెలియజేశారు. ఎంపీడీవో పిడి శ్రీనివాసులు, ఈఓపిఆర్డీ గూడేన్న, ఎస్సై దుగ్గిరెడ్డీ, సచివాలయం అధికారులు, గ్రామ వాలంటీర్లు, వైసిపి మండల కన్వీనర్, ఆలూరు చిక్కన్న, టౌన్ కన్వీనర్ కేశవరెడ్డి, స్థానిక సర్పంచ్భాస్కర్రెడ్డి, ప్రకాష్ రెడ్డి, స్థానిక ఎంపీటీసీ, మాజీ జెడ్పిటిసి నాగిరెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ పైనేటి తిమ్మప్ప చౌదరి, మాజీ పిఎసిఎస్ చైర్మన్ మారెన్న, సర్పంచులు పనింద్ర గౌడ, హనుమంత రెడ్డి, వన్నూరప్ప, భాస్కర్ రెడ్డి, గంగలాపురం ముత్తు, సచివాలయం కన్వీనర్లు శ్రీధర్ రెడ్డి, జగన్నాథ్ రెడ్డి, రామిరెడ్డి, మండలంలో ఉన్న సర్పంచులు, ఎంపీటీసీలు, పాల్గొన్నారు.

హంద్రీనీవాతో లక్ష ఎకరాలకు నీరు అందించాలి

విశాలాంధ్ర బ్యూరో - అనంతపురం : జిల్లాలో లక్ష ఎకరాలకు హంద్రీ నీవా ద్వారా సాగు నీరు అందిస్తామని నమ్మబలికిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తన హామీ ని నిలబెట్టుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ డిమాండ్ చేశారు. ఈమేరకు ఆదివారం జిల్లా కేంద్రంలోని కామ్రేడ్ నీలం రాజశేఖర రెడ్డి భవన్లో రాప్తాడు నియోజక వర్గం సీపీఐ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఆపార్టీ నాయకుడు నరేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి జాఫర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాప్తాడు నియోజకవర్గ పరిధిలో అనేక గ్రామాలు రైతాంగంతో ముడిపడి ఉన్నాయన్నారు. ఇటీవల కురిసిన అధిక వర్షాలు, వడగండ్ల వానలు, ఈదురు గాలులతో చీని, జామ, అరటి, మామిడి తదితర పండ్లతోటలు పూర్తిగా దెబ్బతిన్నాయని దీంతో రైతులు లక్షల రూపాయలు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు ఇంత భారీ ఎత్తున నష్టాలు చవిచూస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం పట్టనట్లుగా వ్యవహరి స్తోందని ఘాటుగా విమర్శించారు. వైసీపీ ఎమ్మెల్యే కనీసం నష్టపోయిన రైతులను పరామర్శించిన పాపాన పోలేదన్నారు. రాప్తాడు నియోజకవర్గంలో హంద్రీ నీవా ద్వారా లక్ష ఎకరాలకు ఆయకట్టుకు పిల్ల కాలువ నుండి నీరు అందిసామని ఓట్లు దండుకున్న సీఎంజగన్ అధికారంలోకి వచ్చి నాలుగు సంవత్సరాలు పూర్తయినా ఒక్క పిల్ల కాలవ సైతం త్రవ్విన పరిస్థితి లేదని ఏకరువు పెట్టారు. హంద్రీనీవాతో తోపుదుర్తి సమీపంలో రిజర్వాయర్ నిర్మాణం కూడా చేపట్టలేని దుస్థితిలో ఉన్నారని విమర్శించారు. హంద్రీనీవా ద్వారా లక్ష ఎకరాలకు నీటి కేటాయింపులు జరిగే విధంగా రిజర్వాయర్లు పూర్తి చేసి రైతులను ఆదుకోవాలన్నారు. కర్ణాటకలో అప్పర్ భద్రా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ను అక్రమంగా నిర్మిస్తున్నారని దీంతో జిల్లాకు నీటి వనరులు పూర్తిగా తగ్గిపోతాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పర్ భద్రా ప్రాజెక్టు నిర్మాణం బేషరతుగా ఆపాలని డిమాండ్ చేశారు. అప్పర్ భద్రా నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ ఈనెల 10 నుండి 19వరకు జిల్లా వ్యాప్తంగా సీపీఐ రైతు సంఘం ఆధ్వర్యంలో గ్రామ గ్రామాన ప్రచార జాతాలు నిర్వహించడం జరుగుతాయన్నారు. అనంతరం 21న జిల్లా కలెక్టరేట్ ఎదుట పెద్ద ఎత్తున రైతు గర్జన మహా సభ నిర్వహిస్తున్నామన్నారు. రైతు గర్జనకు జిల్లా వ్యాప్తంగా రైతులు, వ్యవసాయ కూలీలు, ప్రజలందరూ హాజరై జయప్రదం చేయాలని జాఫర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాప్తాడు నియోజకవర్గ కార్యదర్శి రామకృష్ణ, జిల్లా కార్యవర్గ సభ్యుడు కేశవరెడ్డి, రైతు సంఘం నాయకుడు. వన్నా రెడ్డి, నియోజక వర్గం సహాయ కార్యదర్శి శ్రీకాంత్, రూరల్ మండల కార్యదర్శి రమేష్, రామకృష్ణ రవీంద్ర ప్రజాసంఘాల నాయకులు ధనుంజయ, రాము, శివ, నరేంద్ర, వెంకటనారాయణ, చలపతి, శారద, రాజు పాల్గొన్నారు.

పూజలు నిర్వహించిన మాజీ చీఫ్ సెక్రటరీ

విశాలాంధ్ర - ఉరవకొండ : అనంతపురం జిల్లా ఉరవకొండ మండలంబుదగ్గవి గ్రామంలో వెలిసిన సూర్యనారాయణ స్వామిని ఆదివారం ఆంధ్రప్రదేశ్ మాజీ చీఫ్ సెక్రటరీ ఎల్వి సుబ్రహ్మణ్యం దర్శించుకున్నారు. జేష్ఠ శుద్ధ పౌర్ణమి కావడంతో పరమ పూజ అర్కరిషి మహాగురువు ఆధ్వర్యంలో నిర్వహించిన జేస్టాభిషేకం పూజా కార్యక్రమాలలో మాజీ చీఫ్ సెక్రటరీ కుటుంబ సభ్యులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. మాజీచీఫ్సెక్రటరీనిఅర్చకులుఘనంగా సన్మానించారు. సూర్య దేవాలయం యొక్క చరిత్ర గురించి ఆయన గ్రామస్తులను, ఆలయ కమిటీ సభ్యులను, పూజారులను అడిగి తెలుసుకున్నారు.

తాగునీటి ట్యాంక్ శుభ్రం

విశాలాంధ్ర - విడపనకల్లు : మండల పరిధిలోని వి. కొత్తకోట గ్రామంలో ఆదివారం విడపనకల్లు మండలం వి.కొత్తకోట గ్రామం సర్పంచ్ ఎస్.తిమ్మ రాజు ఆధ్వర్యంలో గత కొన్ని రోజులుగా ట్యాంకు నీరు శుభ్రం చేయక పోవడంతో గ్రామస్తులు సర్పంచ్ దృష్టికి తీసుకు రావడంతో స్పందించి సర్పంచి వెంటనే పారిశుద్ధ్య కార్మికులతో శుభ్రం చేయించారు.

ఒడిసా రైలు ప్రమాదం పై ఎమ్మెల్యే దిగ్భ్రాంతి

విశాలాంధ్ర - గుంతకల్లు : ఒడిశా రైలు ప్రమాద ఘటన యావత్ దేశాన్ని షాక్కు గురి చేసిందని గుంతకల్ ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి అన్నారు. ఈ ఘటనలో 1000 మంది కి పైగా గాయపడగా 300 మంది చనిపోయిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆదివారం గుంతకల్ ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్ ఆర్ పార్టీ నాయకులు గుతంకల్లు వై.వి.ఆర్ నివాసం నుండి ఆంబేత్కర్ విగ్రహం వరకు కొవ్వొత్తులతో ర్యాలి నిర్వహించారు.

ఈస్ట్ కోస్ట్ రైల్వేకు ఎంపికైన మిట్స్ విద్యార్థులు

విశాలాంధ్ర - జేఎన్టీయూఏ : ఈస్ట్ కోస్ట్ రైల్వేస్ భువనేశ్వర్లో మదనపల్లి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్ విద్యార్థులు ఎంపికై నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ యువరాజ్ తెలిపారు. ఒక నెలపాటు విద్యార్థులకు ఇంటర్నెట్ షిప్ లో రైల్వే పరికరాలు పనితీరు, సాంకేతిక నైపుణ్యాలను శిక్షణ తీసుకోనున్నారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ డా. ఎన్ విజయభాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, నియామకాల అధికారి ద్రుపద్ వర్మ, విభాగాధిపతి ముప్పా లక్ష్మణరావు అభినందనలు తెలిపారు.

ప్రభుత్వ ఆశ్రమంలో ప్రవేశమునకు దరఖాస్తు

విశాలాంధ్ర - గుంతకల్లు : ప్రభుత్వ బాలబాలికల ఆశ్రమంలో అంగవైకల్యం, బ్లైండ్ విద్యార్థులు విద్యాసభ్యసించడానికి ప్రవేశమునకు దరఖాస్తుకు సంప్రదించాలని వి.శంకరమ్మ పత్రిక ప్రకటనలో తెలిపారు. ఆమె మాట్లాడుతూ హిందూపురం మండల సమీపంలో గల కొడిగనహళ్లి గ్రామంలో చూపు లోపం గల (బడి ఈడు) వయస్సుల వారికి కొరకు ప్రభుత్వ బాల బాలికల ఆశ్రమ పాఠశాల గత 40 సంవత్సరాల నుండి విజయవంతంగా సేవలందిని అన్నారు. ఈ పాఠశాలలో విద్యను అభ్యసించిన ఎంతోమంది దివ్యాంగులు అయిన వారు ఉన్నత విద్యను అభ్యసించి వివిధ ప్రభుత్వ శాఖలలో కేంద్ర రాష్ట్ర పరిధిలో ప్రభుత్వ ఉద్యోగస్తులుగా ఉన్నతమైన హెూదాలలో పనిచేస్తూ అధికారుల చేత ప్రశంసలు అందుకోవడమే కాక క్రీడా సాంస్కృతిక, సాంకేతిక రంగాలలో నైపుణ్యంని పెంపొందించుకొని ఆయా రంగాలలో కూడా అద్భుతమైనట్టు వంటి ప్రతిభను కనబరుస్తూ అధికారులచే ప్రశంసించబడుతున్నారు. ఈ పాఠశాల యొక్క ప్రత్యేకత హాస్టల్ వసతి సదుపాయం సువిశాలమైన తరగతి గదులు, ఆటస్థలం, మైదానం, భోజన శాలతో పాటు క్రీడా, సాంకేతిక సాంస్కృతిక సంఘాలలో నిష్ణాతులైన ఉపాధ్యాయుల చేత శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలోని ప్రశాంశనీయ దగ్గ పాఠశాలగా పేరుందన్నారు. ఆసక్తిగల (బడిఈడు) అంగ వైకల్యం కలిగిన(బ్లైండ్ విద్యార్థులు) పాఠశాల యందు విద్యాసభ్యసించి తమరి. భవి ష్యత్తుకు బంగారు బాటను వేసుకునుటకు తల్లిదండ్రులు తమరి పిల్లలకుతగు విధంగాప్రోత్సహించివారినిముందుకు నడిపించవల సిందిగా కోరారు.

మురుగునీటి దుర్వాసనతో కాలనీ ప్రజల ఇక్కట్లు... పట్టించుకోని అధికారులు

విశాలాంధ్ర - తాడిపత్రి : పట్టణంలోని బస్టాండ్ ప్రక్కన ఉన్న అంబేద్కర్ కాలనీలో మురుగునీరు ముందుకు సాగక దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని మున్సిపల్ అధికారులు పట్టించుకోవడంలేదని ఆ కాలనీ ప్రజలు వాపోతున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హరిజనవాడ, అంబేద్కర్ కాలనీ ప్రాంతం నుండి మురుగనీరు వెళ్లడానికి ఒకే ఒక ప్రధాన కాల్వ ఉంది. ఈ కాలువ మీదుగా మురుగు నీరు వెళ్లి బస్టాండ్ వైపు నుండి ముందుకు సాగుతుంది. ఈ మురుగునీరు వెళ్లడానికి బస్టాండ్ నుండి బయటికి వెళ్లే రహదారి వద్ద నుండి అంబేద్కర్ నగర్ కాలనీ వరకు కాల్వ నిండా చెత్తాచెదారం అంతా పడి ఉంది. దీంతో మురుగునీరు ముందు కు సాగక దుర్వాసన వస్తోంది. మురుగునీరు నిల్వ ఉండడంతో దోమలు వృద్ధి చెంది డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, వైరల్ లాంటి విష జ్వరాలు వస్తూ ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా అంబేద్కర్ కాలనీలోనే సచివాలయం ఉండి కూడా సచివాలయ సిబ్బంది మురుగునీరు ప్రవహించే ప్రధాన కాల్వ రహదారి గుండా నిత్యం వెళుతూ ఉంటారు. అంతేకాక ఉదయం సానిటరీ ఇన్స్పెక్టర్, వార్డు మేస్త్రి, సచివాలయ సానిటరీ సిబ్బంది తిరుగుతూ ఉంటారు. కానీ చూసి చూడనట్టు వెళుతున్నారు తప్ప మురుగునీరు ముందుకు సాగక సమస్యగా ఉంటే వీటిని పరిష్కరించా లని ఆలోచన కూడా వారికి రావడం లేదన్నారు. మున్సిపాలిటీ పరిధిలో ప్రతి వార్డులో పరిశుభ్రతను పరిశీలించి, ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించవలసిన మునిసిపల్ అధికారులే ఇలా ఉంటే ఇంకా ఎవరు మురుగునీటి సమస్యను పరిష్కరిస్తారని ప్రజలు చెప్పుకుంటు న్నారు. కావున ఇప్పటికైనా క్షేత్రస్థాయిలో మున్సిపల్ కమిషనర్ పరిశీలించి మురుగునీరు ముందుకు వెళ్లడానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

కృషి విజ్ఞాన కేంద్రంలో అన్నదాతలకు విత్తనాలు సిద్ధం

విశాలాంధ్ర - బుక్కరాయసముద్రం : రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో వరి బీపిటి 5204సి ఎస్ రకం 30 కేజీల బస్తా 1200 రూపాయలు, కంది పి ఆర్ జి 176 ఒక కేజీ విత్తనాలు 120 రూ, పెసర ఎన్జీజి జి 42 ఎఫ్ ఎస్ ఒక కేజీ 125 రూ.. విత్తనాలు అందుబాటులో ఉన్నాయని డా. మల్లేశ్వరి సాదినేని తెలిపారు. విత్తనాల కావలసిన రైతులు 7013571755, 70320 58368 నెంబర్ను సంప్రదించాలని కొనుగోలు చేయవచ్చును సూచించారు. ఈ అవకాశాన్ని ప్రతి రైతు సద్వినియోగం చేసుకొని అధిక దిగుబడును సాధించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

సమాజంలో అన్ని రంగాల్లో ఉన్నతంగా రాణించాలి

విశాలాంధ్ర-రాప్తాడు : సమాజంలోని వాల్మీకులు అన్ని రంగాల్లో ఉన్నతంగా రాణించాలని అనంతపురం జడ్పీ చైర్మన్ బోయగిరిజమ్మ, ఎడిసిసి బ్యాంక్ చైర్మన్ మానికింద లిఖిత, మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు సూచించారు. అనంతపురం జిల్లా వాల్మీకి ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని వాల్మీకి కళ్యాణ మండపంలో 2022-23 విద్యాసంవత్సరంలో10వ తరగతి, ఇంటర్ మొదటి రెండవ సంవత్సరాల్లో అత్యుత్తమ ప్రతిభను కనబరిచిన 230 మంది వాల్మీకి విద్యార్థినీ, విద్యార్థులకు డాక్టర్ ఆర్సి అక్కులప్ప అధ్యక్షతన ప్రతిభా పురస్కారాలను అందజేశారు. సమాజంలో అన్నిటికంటే విలువైనది విద్య అని ఆ విద్యను అందిపుచ్చుకోవడంలో వాల్మీకి జాతి బిడ్డలు ముందుండాలని ఆకాంక్షించారు. వాల్మీకి ఏ విధంగా అయితే సమాజానికి ఆదర్శ పురుషుడుగా నిలిచారో మీరు కూడా ఆ విధంగా ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. విద్యలో మేటిగా రాణిస్తే అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. వాల్మీకి జాతిలోఇలాంటి ఆణిముత్యాలను సన్మానించడం మా బాధ్యత అని వాల్మీకి చూపిన సన్మార్గంలో ప్రయాణించి ఉన్నత శిఖరాలు చేరుకోవాలన్నారు. అధిక మార్కులు వచ్చిన విద్యార్థులకు మెమొంటోలు బహుకరించారు. కార్యక్రమంలో ఏడీసీసీ మాజీ చైర్మన్ పామిడి వీరా, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తలారి ఆదినారాయణ, బెల్ డైరెక్టర్, బీజే ఓబీసీ జాతీయ నాయకులు పార్థసారథి, గొట్లూరుచంద్ర, పుట్టపర్తిగంగాద్రి, కోగటంరవి, ఆదినారాయణ, భాగ్యరాజ్, చైతన్యకుమార్, సాకే నరేష్, పుట్టపర్తి వాల్మీకి ఉద్యోగుల సంఘం నాయకులు జయరాం, చంద్ర, పెద్ద ఎత్తున వాల్మీకి కులబాంధవులు పాల్గొన్నారు.

మతసామరస్యానికి షాబాజ్ దివాన్ ఉరుసు

విశాలాంధ్ర - బొమ్మనహాళ్ : మతసామరస్యానికి ప్రతీక అయిన షాబూబ్ దివాన్ వలీ ఉరుసు మహెూత్సవాలు నేటి నుంచి (5వ తేదీ) నుంచి ప్రారంభం కానున్నాయి. ఉరుసు ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కార్యనిర్వాహకులు తెలిపారు. హిందూ ముస్లింల మతసామరస్యానికి ప్రతీక అయిన షాబాజ్ దివాన్ వలీ ఉరుసు ఉత్సవాలు ఏటా అనవాయితీగా చాంద్రమాసం ప్రకారం నిర్వహిస్తారు. షాబాజ్ దివాన్ వలీ ఉరుసు ఉత్సవాల్లో భాగంగా 5వ తేదీన స్వామివారి ఉరుసు ఉత్సవాలు ఘనంగా జరుగనున్నాయి. 5న సోమవారం గంధం, 8 మంగళవాం దీపారాధన, 7న బుధవారం ఉరుసు, 8న గురువారం జియారత్ ఉంటుందన్నారు. బుధవారం తెల్లవారుజామున 3 గంటలకు షంషేరు దర్గా నుండి పీఠాపతుల ఆధ్వర్యంలో ఊరేగింపు జరుగును. ఈ కార్యక్రమాన్నికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విఫ్ కాపురామచంద్రరెడ్డి హాజరవుతున్నట్లు నిర్వహకులు పేర్కొన్నారు.

స్వామివారి చరిత్ర........: ముస్లింలకు మహమ్మద్ ప్రవక్త బోధనలు తెలుపుతూ ప్రజల్లో కాంతి సామరస్యాలు నెల కోల్పుతూ కళుహెరాళ వద్ద ఉన్న ఇసుక దిబ్బలపై షాబాజ్ దివాన్ వలీ దీక్షలో కూర్చునేవారు. స్వామివారి వద్దకు వెళ్లిన ప్రజలకు, భక్తులకు సూక్తులు, హితబోధలు, రోగాలు నయం చేయడం, ఇతర వ్యాపకాలను దూరం చేయడం, వారి బాధలను తగ్గించడం లాంటివి చేస్తుండేవారు. బళ్ళారి కోట నుంచి పెనుకొండ కోటకు రాయల వారి సైన్యం, వాహనాలు, రదాలు, ఏనుగులు, ఒంటెలు, గుర్రాలతో పాటు సైనికుల వేళుతూ దప్పికకు గురయ్యారు. సైన్యాధిపతులు నీటి కోసం వెతుకుతూ స్వామివారిని అర్ధించారు. అప్పుడు సైన్యాధిపతిని గుర్రంలోఒక వైపు వెళ్లాల్సిందిగా స్వామి ఆదేశించారు. గుర్రం వెళుతూ గుర్రం డెక్క దిగడడిన చోట తవ్వమని ఆదేశించారు. గుర్రం మీద వెళుతున్న సైన్యాధిపతి గుర్రం డెక్క ఒక చోట దిగబడటంతో సైనికులతో చెలిమిని తవ్వించారు. అప్పుడు నీరు ఉబికి రావడంతో పాటు సైనికులు, ఏనుగులు, గుర్రాలు, ఒంటెలు కడుపునిండా నీరు తాగాయి. అప్పటి నుంచి చెలిమి ఇప్పటివరకు అలాగే ఉంది. రోజూ దానిద్వారా నీటిని తీసుకోని ప్రజలు వెళుతున్నారు. చూట్టు ఒక కిలోమీటర్లోపు ఎక్కడ బోర్లు వేసినను నీరు పడటం లేదని రైతులు పేర్కొంటున్నారు. ఇది స్వామివారి మహత్యమని రైతులు, భక్తులు చెలిమి నుంచి సీసాలు, బాటీళ్ల ద్వారా నీటిని తీసుకెళుతుంటారు.

ఉద్యోగుల సంఘం నూతన కమిటీ ఎన్నిక



విశాలాంధ్ర - ఉరవకొండ : ఉరవకొండ తాలూకా ఎస్సీ ఉద్యోగుల సంఘం నూతన కమిటీని ఆదివారం ఉరవకొండలో కోర్ కమిటీ సమావేశంలో సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు తాలూకా ఉద్యోగుల సంఘం అధ్యక్షులుగా సాకే డేవిడ్, ఉపాధ్యక్షులుగా మీనుగా నరేష్, చంద్రశేఖర్, మల్లికార్జున ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిలుగా సింగాడి దుర్గాప్రసాద్, ఎల్లప్ప, సహాయ కార్యదర్శి గంగన్న, చంద్రశేఖర్, కోశాధికారులుగా జగదీష్ నాగన్నలను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని కోర్ కమిటీ సభ్యులు తిప్పయ్య, ఎర్రి స్వామి, ఓబులేసు, రామకృష్ణ పాల్తూరు ఆనంద్ రాజు తెలిపారు.

ముంపు బాధితులకు పరిహారం అందించండి

విశాలాంధ్ర-ఉరవకొండ : ఉరవకొండ నియోజకవర్గంలోని బెళుగుప్ప మండలం జీడిపల్లి రిజర్వాయర్ నిర్మాణంలో భాగంగా కింద భాగాన ఉన్న జీడిపల్లి గ్రామస్తులు ఊటనీటితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఆర్అండ్ఆర్ పథకం కింద పునరావాసం కల్పించేందుకు ప్రాతిపాదిత రూ.82.12 కోట్లు వెంటనే విడుదల చేయాలని అనంతపురం జిల్లా ఇంచార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డిని జీడిపల్లి గ్రామస్తులతో కలిసి ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వరరెడ్డి కోరారు. ఆదివారం కళ్యాణదుర్గంలో జరిగే విజ యోత్సవ సభలో పాల్గొనేందుకు వెళుతున్న ఇంచార్జ్ మంత్రికి కాలువ పల్లి వద్ద విశ్వేశ్వరరెడ్డి స్వాగతం పలికారు. దశాబ్ద కాలంగా రైతులకు అమలు చేయాల్సిన ఆర్,ఆర్ ప్యాకేజీ ఇప్పటికీ పెండింగ్లో ఉందన్నారు. రైతులకు వన్ టైమ్ సెటిల్ మెంట్ క్రింద రూ.82.12 కోట్లు రూపాయలు నిధులు విడుదల చేయాలని ఇంచార్జ్ మంత్రి కోరారు.

వివాహ వేడుకల్లో కాపు భారతి

విశాలాంధ్ర-డి.హిరేహాల్ : మండల పరిధిలోని నాగలాపురం గ్రామం వైసిపి నాయకులు నారప్ప వారి కుమారుడి ధర్మేంద్ర తులసీ వారి వివాహ రిసెప్షన్ కార్యక్రమం నాగలింగేశ్వర స్వామి దేవస్థానంలో జరిగింది. కార్యక్రమలో నూతన వధూవరులను జిల్లా ఇండియన్ రెడ్క్రాస్సొసైటి ఛైర్పర్సన్ కాపు భారతి ఆశీర్వ దించారు. మండల గ్రామ సచివాలయం కన్వీనర్ రాళ్ల తిమ్మరెడ్డి, సర్పంచ్ హనుమంతారెడ్డి, పరమేశ్వర, నాయకులు గన్నిగౌడ, జయ రామ్రెడ్డి, ఆనంద, నరసింహ, శివకుమార్, అంజిరెడ్డి, వన్నురస్వామి పాల్గొన్నారు.

రైతుల సమస్యలను పరిష్కరిస్తా

విశాలాంధ్ర-తనకల్లు : కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా చౌడప్ప యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన మాట్లాడుతూ సిపిఐ జిల్లా కార్య దర్శి వేమయ్య యాదవ్, కౌలు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కాటమ య్యకి కృతజ్ఞతలు తెలియజేశారు. నా మీద నమ్మకం ఉంచి జిల్లా కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు కౌలు రైతుల సమస్యలపై శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా కౌలు రైతులను ఏకం చేసి వాళ్ళు పడుతున్నటువంటి కష్టాలు ఈ ప్రభుత్వం కనీసం గుర్తింపు కార్డు కూడా ఇవ్వకుండా నిర్లక్ష్యం వహిస్తూ ఒకవైపు కౌలు మరోవైపు పెట్టుబడి రాత్రి పగలు కష్టపడి పండించిన పంటకు ఖచ్చితమైన ధర లేక కౌలు రైతులు నష్టాల పాలవుతున్నారు. కౌలు రైతుల తరఫున నిరంతరం ఏపీ రైతు సంఘాన్ని కలుపుకొని పోరాటాలు చేస్తామని తెలిపారు.

గరుడ సేవ సమాజ సంక్షేమం కోసమే

విశాలాంధ్ర - ధర్మవరం : ప్రతినెల నిర్వహించే పౌర్ణమి గరుడ సేవలో దాతల సహాయ సహకారంలోనే జరుగుతోందని, ఇటువంటి కార్యక్రమాలు సమాజ శ్రేయస్సు కొరకే నిర్వహించడం జరుగు తోందని ఆలయ చైర్మన్ దాశెట్టి సుబ్రహ్మణ్యం, ఆలయ ఈవో వెంకటేశులు తెలిపారు. ఆదివారం సాయంత్రం తిరుమల తిరుపతి పుణ్యక్షేత్రంలో జరిగే విధంగా సాంప్రదాయ పద్ధతిలో ధర్మవరం పట్టణంలో కూడాపౌర్ణమి గరుడ సేవను సాంప్రదాయ పద్ధతిలో, అర్చకులు కోనేరా చార్యులు, చక్రధర్ మకరంద బాబు, భాను ప్రకాష్ తోపాటు భక్తాదుల నడుమ అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామివారిని వివిధ రకాల పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరణ గావించారు. తదుపరి గరుడసేవ వాహనంలో శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామిను గరుడ సేవలో ఆసీనులు చేసి, ప్రత్యేక పూజలు జరిపారు. సాయంత్రం 6 గంటల నుండి రాత్రి 9గంటల వరకు స్వామి వారిని పట్టణ పురవీధులలో ఊరే గింపు నిర్వహించారు. గరుడ సేవ దాత లైన డాక్టర్ బలుషా వెంకట సుబ్బా రావు, కీర్తిశేషులు పోలా లక్ష్మయ్య అండ్ సన్స్కుటుంబ సభ్యులను చైర్మన్ వేదమం త్రాలు, మంగళ వాయిద్యాలు నడుమ అందరిని ఘనంగా సత్కరించారు.ఉపాధ్యక్షులు కుండా చౌడయ్య, ఆలయ పాలక సభ్యులు తోపాటు పోరాళ్ల పుల్లయ్య, పోరాళ్ల పద్మావతి, వారి శిష్య బృందం, భక్తాదులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వాచ్మెన్ గది నిర్మాణం అభినందనీయం

విశాలాంధ్ర-ధర్మవరం : పూర్వ విద్యార్థుల దాతృత్వం చే వాచ్మెన్ గది నిర్మాణం అభినందినీయమని కే హెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని కే హెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పూర్వపు విద్యార్థులచే వాచ్మెన్ గదిని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ 1983-84 బ్యాచ్కు చెందిన డిగ్రీ పూర్వ విద్యార్థులు గోరకాటి పెద్దారెడ్డి రూ.1,45,000, తదుపరి ఆర్ రాధ కృష్ణమరాజు రూ.50,000 తో పాటు వీరి మిత్రబిందం భాగస్వామ్యంతో ఈ గది నిర్మాణం జరిగిందని వారు తెలిపారు. పూర్వపు విద్యార్థులు తమ సొంత ఖర్చుతో ఇటువంటి కార్యక్రమం నిర్వహణ పట్ల ప్రిన్సిపాల్ కృతజ్ఞతలు తెలియజేశారు. నేడు ఈ ప్రభుత్వ కేహెచ్ డిగ్రీ కళాశాల దాతల సహాయ సహకారములతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి, విద్యార్థులకు నాణ్యమైన సేవను మా అధ్యాపక బృందం తప్పక అందిస్తుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు కిరణ్ కుమార్, రామ్మోహన్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ శివప్రసాద్, ఫిజికల్ డైరెక్టర్ ఆనంద్, ఎం. స్వామి, పూర్వపు విద్యార్థులు గోరకటి పెద్దారెడ్డి, యోగ నారాయణరెడ్డి, ఏ. వెంకటేశు,నారాయణ మూర్తి, సిబ్బంది సరస్వతి, నల్లమ్మ, వాచ్మెన్ వేణు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు కమిషనర్ సేవలను మరువలేరు

విశాలాంధ్ర- ధర్మవరం: బదిలీగా వెళ్ళిపోతున్న మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, వారి హయాంలో చేసిన అభివృద్ధి పనులను ప్రజలు మరువలేరని 25వ వార్డు కౌన్సిలర్ మేడాపురం వెంకటేష్ పేర్కొన్నారు. ఆదివారం సచివాలయ సిబ్బందితోపాటు కౌన్సిలర్ మున్సిపల్ కమిషనర్ గెస్ట్ హౌస్‌లో చేరుకొని కమిషనర్ మల్లికార్జున్ ని ఘనంగా సత్కరించారు.కౌన్సిలర్ మాట్లాడుతూ కమిషనర్‌గా మూడు సంవత్సరాల మూడు నెలలు కాలంలో ధర్మవరం పట్టణాన్ని ఎంతో అభివృద్ధి దిశలో చేయుటకు వారి కృషి అనన్యమైనదని తెలిపారు. కమిషనర్ బదిలీ మాకు బాధాకరమైన, వారి సేవలు గుంతకల్ మున్సిపాలిటీకి అందించబోవడం మరింత సంతోషదాయకం అని తెలిపారు. అక్కడ కూడా ప్రజలు కమిషనర్ కు సహకరించి అభివృద్ధి బాటలో తప్పక నడుపుతారని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ సాయి ప్రకాష్, సిబ్బంది మురళి గిరి, శిరీష సరిత, కాత్యాయణి, నరేంద్ర బాబు, పుష్ప రాజు తదితరులు పాల్గొన్నారు.

చేనేత సమస్యల పరిష్కారించాలి

విశాలాంధ్ర - ధర్మవరం : ఏళ్ల తరబడి చేనేత పరిశ్రమను నమ్ముకున్న చేనేత కార్మికుల సమస్యల సాధనకై ఈనెల 19న కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించడం జరుగుతుందని ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోలా రామాంజనేయులు, ఏపీ చేనేత కార్మిక సంఘం తాలూకా కార్యదర్శి వెంకటనారాయణ, జాతీయ చేనేత ఐక్యవేదిక వర్కింగ్ ప్రెసిడెంట్ చట్టా రవి వర్ధన్ పేర్కొన్నారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో ఆదివారం వామపక్షాలు విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ మారిన చేనేత కార్మికుల జీవన పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందని, ప్రజా పాలకులు, అధికారులు పట్టి, పట్టినట్లు వ్యవహరించడం వలన, చేనేత కార్మికులు ఆకలి చావులతో ఆత్మహత్యలు జరగడం చాలా బాధాకరమన్నారు. ప్రస్తుతం నిల్వ ఉన్న చేనేత వస్త్రాలను ప్రభుత్వమే తక్షణం కొనుగోలు చేయాలని, చేనేతకు 11రకాల వస్త్రాల రిజర్వేషన్ చట్టాన్ని పగడ్బందీగా అమలు జరపాలని, చిలప నూలు,చేనేత వస్త్రాలపై విధించిన జీఎస్టీని తక్షణమే రద్దు చేయాలని, నేతన్న నేస్తం పథకాన్ని షెడ్డు వ ద్దుగాల కార్మికులకు, ఉపవృత్తుల కార్మికులకు కూడా వర్తింపజేయాలని వారు డిమాండ్ చేశారు. మానవ సమాజానికి నాగరికతను అందించిన చేనేత కళ నేడు కనుమరుగై పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్లో మిల్లు వస్త్రాలతో పోటీ పడలేని దుస్థితికి చేనేత పరిశ్రమ చేరుకుందని తెలిపారు. పవర్లూమ్స్ మగ్గాల్లో చేనేతకు 11 రకాల వస్త్రాల రిజర్వేషన్ చట్టాన్ని సక్రమంగా అమలు జరపకుండా, ఉల్లంఘించిన వారిపైన కఠిన చర్యలు తీసుకుంటూ, కేసులు నమోదు చేయాలని తెలిపారు. అంతేకాకుండా చేనేతను ఉద్ధరిస్తున్నామని చెబుతున్న ప్రభుత్వాలు, ఆచరణలో అందుకు విరుద్ధంగా వ్యవహరించడం దారుణమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేతకు నిధులు కేటాయించడంలో ప్రభుత్వాల నిర్లక్ష్యమే కాదు, వాటి అవమాన పూరిత వైఖరికి నిదర్శనం అని తెలిపారు. నేతన్న నేస్తం తప్పనిసరిగా మూడు లక్షల మంది నేతన్నలకు వర్తింప చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం చేనేతల యొక్క పాత పథకాలను పూర్తిగా ఎత్తివేయడం సరైన పద్ధతి కాదని తెలిపారు. ఇలాంటి పరిస్థితులు పర్యావసరంగా చేనేత వృత్తి సంక్షోభం మరింత భయంకరంగా మారిందని తెలిపారు. నేడు రాష్ట్రంలో నేతన్నలకు పని దొరకడం దుర్లభమైందని సరుకు పేరుకుపోయిన కారణంగా పని కల్పించడానికి మాస్టర్ వీవర్లు కూడా నిరాకరించడం జరుగుతోందని తెలిపారు. చేనేత పైన జీఎస్టిని పూర్తిగా రద్దు చేయాలని, కేంద్ర ప్రభుత్వం కేటాయించిన వార్షిక బడ్జెట్ సరిపోదని, 25 వేల కోట్లు కేటాయించాలని తెలిపారు. విద్యా సంస్థలతో సహా అన్ని ప్రభుత్వ సంస్థల్లో చేనేత వస్త్రాలని వినియోగించే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని తెలిపారు. చేనేత సహకార సంఘాలకు చెల్లించవలసిన బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని తెలిపారు. ఆప్కో ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించాలని తెలిపారు. పై డిమాండ్లపైనే పరిష్కారం కొరకు ఈనెల 19న నిర్వహించబోయే కలెక్టర్ కార్యాలయ ధర్నాలో చేనేత కార్మికులు, సహకార సంఘాల బాధ్యులు, మాస్టర్ వీవర్లు, చేనేత శ్రేయోభిలాషులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో చేనేత నాయకులు రవికుమార్, వై. రమణ, వెంకటస్వామి, అన్నం సూరి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలు పట్ల ప్రజల్లో సంతోషం

విశాలాంధ్ర - పుట్టపర్తి : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పట్ల ప్రజల్లో సంతోషం వ్యక్తం అవుతుందని శాసనసభ్యుడు దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణంలోని 15 వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం తో పాటు జగనన్నే మా భవిష్యత్తు అన్న కార్యక్రమంలో కూడా పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అందుతున్నాయా ఇంకా ఎవరికైనా అందలేదా అని ప్రజలతో అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల పట్ల సంతోషంగా ఉన్నారా, ఈ పథకాలను అమలు చేయాల్సిన అవసరం ఉందా అని ఆరా తీశారు. అనంతరం దుద్దుకుంట విలేకరులతో మాట్లాడుతూ, ప్రతి ఇంటికి ఏదో ఒక పథకం అందిందని పథకాలు పొందని వారంటూ ఎవరు లేరని ఈ కార్యక్రమం లో తెలిసిందన్నారు. ఏ రాష్ట్రంలో కూడా ఇన్ని సంక్షేమ పథకాలు అమలు చేసిన దాఖలాలు లేవన్నారు. వైసిపి మేని పేస్టో లో పొందుపరచిన అన్ని పథకాలు 99శాతం అమలు అయినాయన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి తన సుదీర్ఘ పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేశారన్నారు. ఏ ఇంటికి పోయినా వారి మాటల్లో ఆనందం కనిపిస్తోందన్నారు.మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, వైస్ చైర్మన్లు తిప్పన్న, లక్ష్మీ నారాయణ రెడ్డి, పుడా చైర్పర్సన్ లక్ష్మీనరసమ్మ, పట్టణ కన్వీనర్ రంగారెడ్డి, కౌన్సిలర్లు పవన్ కుమార్, సూర్య గౌడ్,లక్ష్మిదేవి, నాయకులు మాధవరెడ్డి, గంగాద్రి మాజీ కౌన్సిలర్ రాంజీ నాయక, రిషికేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కరించడానికి చర్యలు

విశాలాంధ్ర - అగళి : మండల పరిధిలోని హుళ్లేకేరా, దేవరపల్లి తండాలో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించడానికి ఎంపీపీ రేణుక కామరాజు, సర్పంచ్ రామకృష్ణప్ప చర్యలు తీసుకున్నారు. తాగునీటి సమస్య తీర్చడానికి ఆదివారం కొత్తగా బోరుబావిని తవ్వించారు. హుళ్లేకేరా దేవర హల్లి గ్రామపంచాయతీ తాండ గ్రామంలో గత రెండు రోజుల నుంచితాగునీటి సమస్యలు తీవ్రంగా ఎదుర్కొంటున్నామని గ్రామ ప్రజలు గ్రామపంచాయతీ సర్పంచ్ దృష్టికి తీసుకుని వెళ్లడంతో సమస్యకు స్పందించిన స్థానిక సర్పంచ్ తోపాటు మండల పరిషత్ అధ్యక్షు లు శ్రీ.రేణుక కామరాజు మండల గ్రాంట్ నిధులతో అధికారుల ఆమోదంతో ఆదివారం బోరు బావిని తవ్వించడానికి చర్యలు తీసుకున్నారు. బోర్వెల్ లారీకి పూజ చేసి ప్రారంభించగ బోర్ బావిలో సమృద్ధిగా నీరు దొరికాయి.స్థానిక సర్పంచ్ రామకృష్ణప్ప, మండల కో ఆప్షన్ నాసిర్, స్థానిక వైకాపా నాయకులు, తాండ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పేద ప్రజలకు సేవ చేయుట మా ఆశయం

విశాలాంధ్ర - ధర్మవరం : పేద ప్రజలకు సేవ చేయుట మా ఆశయమని యువర్ ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వై కే. శ్రీనివాసులు, సుకుమార్, కోశాధికారి రాధాకృష్ణ, క్యాంపు చైర్మన్ జయరాం పేర్కొన్నారు.పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల లో ఆదివారం యువర్స్ ఫౌండేషన్ వారి సౌజన్యంతో, శ్రీ చక్ర హాస్పిటల్ కర్నూల్ వారికే ఉచిత కంటి వైద్య శిబిరమును నిర్వహించారు. అనంతరం అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ ప్రస్తుతం ఈ శిబిరం లో 71 మంది కంటి రోగులు పాల్గొనగా, ఇందులో 34 మంది ఉచిత కంటి ఆపరేషన్లకు ఎంపిక కావడం జరిగిందన్నారు. తదుపరి కంటి పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలను చక్ర హాస్పిటల్ వారు తెలియజేశారని తెలిపారు. ఈ శిబిరంలో కంటి శుక్లము గలవారికి ఉచితంగా పరీక్షలు నిర్వహించామని, అర్హులైన వారికి ఆరోగ్యశ్రీ/ ఈహెచ్ఎస్ నిబంధనల ప్రకారం ఆపరేషన్లు కూడా నిర్వహించబడుతుందని తెలిపారు. శిబిర దాతలుగా శీలం సావిత్రమ్మ, శీలం శ్రీ రాములు గాంధీనగర్ వాసులు వ్యవహరించడం పట్ల ప్రత్యేక కృతజ్ఞతలను తెలియజేశామన్నారు. తమ యువర్స్ ఫౌండేషన్ సంస్థ నేత్ర దానాలు కూడా స్వీకరించి, ఎంతోమంది జీవితాలలో వెలుగు నింపడం జరిగిందని, ప్రతి ఒక్కరూ నేత్రదానం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సభ్యులు పోలా ప్రభాకర్, చాంద్ భాషా,రమేష్ బాబు, సిం గనమల ప్రసాద్, షీలా నాగేంద్ర, బండి నాగేంద్ర, కుమార్ స్వామి, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

కొండెక్కిన కోడి మాంసం ధరలు

విశాలాంధ్ర- చిలమత్తూరు రూరల్ : మండల కేంద్రంలో ఆదివారం కోడి మాంసం కొండెక్కిందంటూ మాంసం ప్రియులు చర్చించుకుంటున్నారు. చాలా మందికి ముక్క లేనిదే ముద్ద దిగదు. వారానికి కనీసం రెండు సార్లైనా తినకుండా అస్సలు ఉండలేరు. ప్రస్తుతం ఎండాకాలం కావడంతో కోళ్ల ఉత్పత్తి గణనీయంగా పడిపోవడంతో ఈ ప్రభావం రేట్లపై పడింది. తాజాగా, ఆంధ్రప్రదేశ్ జిల్లాలో చికెన్ ధరలు భారీగా పెరిగిపోయాయి. దీంతో ఈ విషయం తెలుసుకున్న మాంసం ప్రియులు బెంబేలెత్తిపోతున్నారు. కోళ్ల ఫారం వారు హోల్‌సేల్ వ్యాపారులకు సరఫరా దారులు రూ.150 ధర నిర్ణయించగా, రిటైర్లకు రూ.165 వరకూ విక్రయిస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో బాయిలర్ కోడి కేజీ హోల్‌సేల్ ధర రూ. 170 కాగా, చికెన్ కేజీ రూ240. వరకూ విక్రయిస్తున్నారు. అయితే కోళ్ల కొత్త బ్యాచ్ వచ్చే వరకు ఇవే ధరలు ఉంటాయని వ్యాపారులు తెలిపారు. చికెన్ రేట్లు కొండెక్కడంతో వ్యాపారులు కోళ్ల ఫారంలో ఉన్న కేజీన్నర దాటిన వాటిని విక్రయిస్తున్నారు. చికెన్ రేట్లు పెరుగుతున్నా విక్రయాలు మాత్రం తగ్గడం లేదు. అంతేకాకుండా ఈ ధరలు జూన్ నెలాఖరు వరకు కొనసాగే అవకాశం ఉన్నట్లు సమాచారం.

పాత్రికేయ తల్లి మృతికి పలువురు సంతాపం

విశాలాంధ్ర - రొద్దం : మండల పరిధిలోని లోచర్ల గ్రామానికి చెందిన విశాలాంధ్ర విలేకరి ఆదినారాయణ తల్లి నారాయణమ్మ (75)అనారోగ్యంతో చనిపోగా ఆమె మృతదేహానికి పూల మాల వేసి నివాళులు అర్పించిన సత్యసాయి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, నియోజకవర్గం ఇంచార్జి బికె. పార్థసారథి మరియు కాంగ్రెస్ పార్టీ ఏఐసీసీ మెంబర్ కె టీ శ్రీధర్, రొద్దం నరసింహులు, కన్వీనర్ నరహరి, వెంకటరామిరెడ్డి, అశ్వర్థ నారాయణ, జడ్పిటిసి ఆ కులప్ప, నారాయణరెడ్డి, ప్రకాష్ రెడ్డి, మండ్లి సర్పంచ్ కిష్టప్ప, గంగాధర్, అగ్రి చేర్మెన్ కొండలరాయుడు, మల్లికార్జున, ప్రసాద్, వెంకటరామిరెడ్డి, కిష్ట తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ మేని పోస్టో విడుదలతో వైసీపీలో భయం

విశాలాంధ్ర - ధర్మవరం : టిడిపి మినీ మినీ ఫెస్టో విడుదలతో వైసీపీలో భయం పుట్టుకుందని టిడిపి నాయకులు పురుషోత్తం గౌడ్, పరిసే సుధాకర్ పేర్కొన్నారు. ఆదివారం నియోజకవర్గ ఇన్చార్జ్ పరిటాల శ్రీరామ్ సూచనల మేరకు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నాయకులకు సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ధర్మవరం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ సైనికుళ్ళ పనిచేయాలని తెలిపారు. ప్రతి పోలింగ్ బూత్ లెవెల్లో సెక్షన్ ఇన్చార్జిల నియామకం కొరకు ఈ సమావేశాన్ని నిర్వహించమన్నారు. పట్టణంలోని 27, 34 వార్డులలో నియామకం జరిగిందన్నారు. రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలు ఎప్పుడు జరిగినా తెలుగుదేశం పార్టీ ఘన విజయం సాధించబోతుందని ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు, ధర్మవరం శాసనసభ్యుగా పరిటాల శ్రీరామ్ గెలవబోతున్నారని అందుకే సెక్షన్ల ఇంచార్జిగా నియామక కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. మహాశక్తి పథకం ద్వారా కుటుంబంలో ఉన్న మహిళలందరికీ లబ్ధి చేకూరుతుందని, నిరుద్యోగ యువతీ యువకులకు ప్రతినెల 3 వేల రూపాయలు, ప్రతి రైతు కుటుంబానికి అన్నదాత పథకము ద్వారా ఏడాదికి 20వేల రూపాయలు రైతు ఖాతాలోకి జమ చేయడం జరుగుతుందని వారు తెలిపారు. తెలుగుదేశం పార్టీ మేనిఫెస్టోను ప్రతి ఒక్కరికి వివరించి అన్ని వర్గాల ప్రజల్ని ఆకట్టుకునే విధంగా నాయకులు కార్యకర్తలు కృషి చేయాలని వారు ఇన్చార్జిలకు సూచించారు. నాగూర్ హుస్సేన్, బిబి, కొత్తపేట ఆది, రహీం భాష తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడి భవన నిర్మాణానికి భూమి పూజ

విశాలాంధ్ర - హిందూపురం : హిందూపురం రూరల్ పరిధిలోని మలుగూరు గ్రామ పంచాయతీ పరిధిలోని నందమూరి నగర్ లో, 19 లక్షల రూపాయల వ్యయంతో అంగన్వాడి భవన నిర్మాణానికి స్థానిక సర్పంచ్ రమేష్ భూమి పూజ చేశారు. స్థానిక సర్పంచ్ రమేష్ మాట్లాడుతూ, ఇంతవరకు గ్రామంలో అంగన్వాడీ సొంత భవనం లేకపోవడంతో, అధికారులకు ప్రతిపానలు పంపడంతో నిధులు మంజూరయ్యాయని, త్వరితగతిన భవన నిర్మాణం పనులు పూర్తి చేసి, నందమూరి గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.వైసిపి నాయకులు ఏకాశప్ప, అంగజాల శేఖర్, స్కూల్ కమిటీ చైర్మన్ రమణ, మిల్లు నరసింహప్ప, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియం చేసుకోండి

విశాలాంధ్ర - కొత్తచెరువు : గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అధికారి కె. జయరాం తెలిపారు. వేసవి విజ్ఞాన శిబిరాలు ప్రభుత్వము నిర్వహిస్తున్నందున ఈ కార్యక్రమానికి విద్యార్థులు విచ్చేసి పుస్తకాలను చదివి జ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఇక్కడ పలు రకాల పుస్తకాలు అందుబాటులో ఉంటాయని, వాటిని ఉపయోగించుకోవాలని విద్యార్థులకు ఆయన సూచించారు. వారు పుస్తక పఠనం ఆటలు చేపట్టారు. ఉపాధ్యాయులు నరసింహులు, ప్రసాదు, అటెండర్ మునీర్, పాఠకులు మొహమ్మద్,రమేషు,రాఘవ,నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంతోషంగా ఉండాలన్నదే టీడీపీ ధ్యేయం

విశాలాంధ్ర-బత్తలపల్లి : వ్యవసాయం పనులు చేసే ప్రతి రైతు సంతోషంగా ఉండటమే తెలుగుదేశం ధ్యేయమని నియోజవర్గ బాధ్యుడు పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. ఏరువాక పౌర్ణమి పురస్కరించుకొని ఆదివారం మండలం పరిధిలోని రామాపురం గ్రామంలో ఏరువాక కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా పొలాల్లో నేలతల్లికి, అలాగే కాడెద్దులకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రైతులతో కలసి వేరుసెనగ విత్తన సాగును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామానికి చెందిన రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ ఒకప్పుడు రైతు అంటే అన్నం పెట్టే వ్యక్తిగా దేశం గౌరవించేదన్నారు. కానీ రైతుకు వ్యవసాయం భారంగా మారి, పట్టణ ప్రాంతాలకు వలసలు వెళ్లి కూలీలుగా మారుతున్నారన్నారు. అంతే కాకుండా రాష్ట్ర ప్రభుత్వ విధానాలతో రైతులకు వ్యవసాయం భారంగా మారుతోందన్నారు. గతంలో రైతులు పంట నష్టపోతే.. ఇన్ పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్ క్రమం తప్పకుండా వచ్చేదన్నారు. కానీ నేడు అలాంటి పరిస్థితి లేదన్నారు. మరోవైపు అనంతపురం జిల్లాకు డ్రిప్, స్ప్రింకర్లు వంటి అత్యాధునిక సాగు విధానాలను చంద్రబాబు తీసుకొచ్చి.. వాటిని రైతులకు అందించారన్నారు. కానీ ఈ నాలుగేళ్లలో రైతులకు అలాంటి సాయం ఎక్కడా లభించడం లేదన్నారు. అందుకే వైసీపీ ప్రభుత్వంలో రైతులు పడుతున్న కష్టాల నుంచి గట్టెక్కించడానికి రైతు అనుకూల మ్యానిఫెస్టోని చంద్రబాబు తీసుకొచ్చారు. ప్రతి రైతుకు 20వేల పెట్టుబడి సాయంతో పాటు అలాగే గతలో ఇచ్చిన విధంగా అన్ని రకాలుగా ప్రోత్సాహకాలు అందిస్తామన్నారు. రానున్న రోజుల్లో పూర్తి స్థాయి మ్యానిఫెస్టోలో రైతులకు పూర్తి ప్రధాన్యం ఇస్తారన్నారు. అలాగే ఏరువాక ప్రారంభం సందర్భంగా రైతులంతా సంతోషంగా పంటలు సాగు మొదలు పెట్టాలని.. వర్షాలు బాగా కురవాలని శ్రీరామ్ ఆకాంక్షించారు. మండల కన్వీనర్ గోనుగుంట్ల నారాయణరెడ్డి,జిల్లా తెలుగు రైతు కార్యాన్నిర్వాహక కార్యదర్శి గంటాపురం జగ్గు, నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు చల్లా శ్రీనివాసులు, స్థానిక నాయకులు చెన్నకేశవులు, తరిగోపుల చౌదరి, రాము, అజయ్, గోనుగుంట్ల అమర్నాథ్, సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - నల్లచెరువు : మండల కేంద్రంలోని గీతామందిరం లో పౌర్ణమి సందర్భంగా ఆదివారం ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు దాదెం వెంకట శివా రెడ్డి అధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. పాలపాటి దీన్ని ఆలయ చైర్మన్ దేవరేంటి భాస్కర్ రెడ్డి నేతృత్వంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రామారావు, జి.వెంకటరమణ, అమర్నాథ్ రెడ్డి, పెద్దవెంకటరమణ, వై రమణారెడ్డి, బజన బృందం పాల్గొన్నారు.

దమ్ము ధైర్యం ఉంటే నువ్వు చేసిన అభివృద్ధి చూపించు

విశాలాంధ్ర - గోరంట్ల : టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ ఎంపీ నిమ్మల కృష్ణప్ప పెనుకొండ శాసనసభ్యులు మాల గుండ్ల శంకర నారాయణ పై మీడియా సమావేశంలో చేసిన ఆరోపణలను వైఎస్ఆర్సిపి ప్రజాప్రతినిధులు నాయకులు కార్యకర్తలు తిప్పి కొట్టారు. అభివృద్ధి గురించి ఎమ్మె ల్యే మాల గుండ్ల శంకరనారాయణ గురించి మాట్లాడే నైతిక హక్కు నీకు లేదని గత 40సంవత్సరాల రాజకీయ చరిత్ర అంటూ గొప్పలు చెప్పుకోవడం తప్ప చేసింది ఏమీ లేదని కనీసం పుట్టిన ఊరికి ఉన్న పట్టణానికి నువ్వు ఏమీ అభివృద్ధి చేశావు చూపించాలని సవాల్ విసిరారు, సొంత గ్రామానికి టిడిపి హయం లో రోడ్డు కూడా వేశలు దుస్థితిలో ఉన్న నీవు జోలి శాఖ మంత్రిగా ఎన్ని అక్రమాలు చేశావో మండల ప్రజలు జిల్లా ప్రజలందరికీ తెలుసని ఆరోపించారు, దమ్ము ధైర్యం ఉంటే నువ్వు చేసిన అభివృద్ధి చూపించాలని ఘాటుగా విమర్శించారు, కమిషన్ల కోసం కక్కుర్తి పడి త్రాగునీటి పైప్లైన్ బ్రిడ్జి నిర్మాణం కూడా చేయించకపోతే వైఎస్ఆర్సిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే మాలగుండ్ల శంకర నారాయణ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి అభివృద్ధి పనులు పూర్తిచేసి ప్రారంభించ లేదా అని ప్రశ్నించారు, ఒకరిద్దరిని పక్కన పెట్టుకొని వర్గం వర్గం అంటూ గొప్పలు చెప్పుకోవడమే తప్ప అభివృద్ధి చేసింది శూన్యమని అభివృద్ధి గురించి మాట్లాడే అర్హత నీకు లేదని ఆరో పించారు, అలాగే మండలంలోని బూదిలి వద్ద గల కోటి లింగేశ్వర స్వామి దేవాలయం మన్యం భూములను వైసిపి వారు కబ్జా చేస్తున్నారని లేనిపోని ఆరోపణలు చేయడం హాస్యాస్పదమని అది విక్రయించింది చేసింది టిడిపి వారు కాదా అని ప్రశ్నించారు. అలాగే నిమ్మల కృష్ణప్ప డౌన్ డౌన్, అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ అభివృద్ధిని చూపించాలని ఎమ్మెల్యే చేసిన అవినీతిని నిరూపించాలని బస్టాండ్ సర్కిల్ నందు నిరసన తెలిపి పట్టణంలో ర్యాలీగా వెళుతుండగా పోలీస్ స్టేషన్ వద్ద పోలీసులు అడ్డుకొని వారిని పంపివేశారు. మండల కన్వీనర్ లక్ష్మీ నరసప్ప, సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ జిల్లా రైతు విభాగం అధ్యక్షులు పాటూరి శంకర్ రెడ్డి, సర్పంచ్ సరోజా నాగే నాయక్, జెడ్పి కోఆప్షన్ సభ్యులు డాక్టర్ భాష, సర్పంచ్ అశ్వర్థ రెడ్డి, మేదర శంకర, మాజీ సర్పంచ్ వెంకట శివారెడ్డి, ఉప సర్పంచ్ బుల్లెట్ బాబు, సుబ్బారెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ సమరసింహారెడ్డి,విజయ్‌సింహారెడ్డి, సంపత్ కుమార్, ముసలి రెడ్డి, జొన్న ఆంజనేయులు, అతావుల్లా, గుంటిపల్లి ఈశ్వరయ్య, జనార్ధన్, సర్పంచ్ శ్రీరాములు, మల్లికార్జున్ రెడ్డి, మల్లికార్జున, సర్పంచ్ శివానంద, పతి నాయక్, సుధాకర్, పాలసముద్రం శ్రీనివాస్ రెడ్డి, అగ్రి డైరెక్టర్ లక్ష్మిరెడ్డి, అధ్యక్షులు రాజేంద్రప్రసాద్, నబి రసూల్,శ్రీనివాసులు,బాబు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యంతో ముందుకు వెళితే విజయం తథ్యం

విశాలాంధ్ర - ధర్మవరం : విద్యార్థులు లక్ష్యంతో ముందుకు వెళితే జీవితములో విజయం తప్పక లభిస్తుందని శ్రీ పద్మశాలీయ బహుత్తమ సంఘం అధ్యక్షులు జక్కా చిన్న సింగరయ్య, కార్యదర్శి జింక చిన్నప్ప, కోశాధికారి పోరాళ్ల పుల్లయ్య తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని పద్మశాలియ కళ్యాణ మండపంలో ఆదివారం ఉదయం పద్మశాలియ కులస్తుల విద్యార్థులలో పదవ తరగతి, ఇంటర్మీడియట్ లలో అత్యధిక మార్కులు సాధించిన వారికి అభినంద సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పదవ తరగతిలో, అదేవిధంగా ఇంటర్మీడియట్ లో అత్యుత్తమ మార్కులతో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు నగదు పురస్కారంతోపాటు మెమొంటో ప్రశంసా పత్రమును సంఘం వారు అందజేశారు. తదుపరి జక్కా చిన్న సింగరయ్య మాట్లాడుతూ ప్రథమ, ద్వితీయ స్థానాలలో వచ్చిన వారికి రూ.3,500, తృతీయ స్థానంలో వచ్చిన వారికి రూ.2,500 లను ఇవ్వడం జరిగిం దన్నారు. అదేవిధంగా త్రిబుల్ ఐటీ లో, ఎంబిబిఎస్ లో ఫ్రీ సీటు పొందిన ఊట్ల నరేంద్ర, నల్లగుండ్ల భువనచంద్ర అనే విద్యార్థులకు రూ.10,116 నగదు బహుమతిని అందజేశామని తెలిపారు. ముమ్మందు మరిన్ని విద్యా సేవా కార్యక్రమాలను చేపట్టి విద్యార్థులను ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. చదువుకు పేదరికం ఎప్పుడూ కూడా అడ్డం కాకూడదన్న అభిప్రాయంతోనే, సంఘం తరఫున విద్యార్థులను ప్రోత్సహించడం జరిగిందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, సంఘం సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

వైసీపీ అభివృద్ధికి కృషి చేస్తాం

విశాలాంధ్ర-పెనుకొండ : పెనుకొండ నియోజకవర్గ కేంద్రం నందు ఆదివారం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకురాలు సానే ఉమారాణి ఆధ్వర్యంలో కార్యకర్తలతో కలిసి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముందుగా వైయస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి అనంతరం కేక్ కట్ చేసి వైఎస్సార్ అమరహే అంటూ నినాదాలు చేసి బైక్ ర్యాలీ ప్రారంభించారు. పురవీధుల గుండా బైక్ ర్యాలీ నిర్వహించి పాత్రికేయుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ వైయస్ జగన్మోహన్ రెడ్డి జనరంజక పాలన నాలుగు సంవత్సరాలు పూర్తి చేసినందున సంఘీభావంగా బైక్ ర్యాలీ నిర్వహించి వైఎస్ విగ్రహానికి నివాళులర్పించామని, వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశిస్తే ఆయన ఆశీస్సులతో పెనుకొండ నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా పోటీ చేయాలని భావిస్తున్నానని, మా తండ్రి చెన్నారెడ్డి, మా అన్న రమణారెడ్డి ఎమ్మెల్యేగా పనిచేశారని, ఎన్నో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి ఎంతమందికి సేవా కార్యక్రమాలు చేసినందున మా కుటుంబం పట్ల ఎంతో మంది కార్యకర్తలు, అభిమానులు ఉన్నారని, కావున అందరినీ కలుపుకొని పార్టీని బలోపేతం చేయడానికి జగనన్న రాబోయే 2024 ఎన్నికలలో విజయం సాధించుటకు కృషి చేస్తామని, పార్టీ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని ఆమె తెలిపారు.